సాక్షి
నంద్యాల

ఆదివారం । 30 । జూన్ । 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: నిత్యాన్నదాన పథకానికి శనివారం నంద్యాలకు చెందిన ఏరాసు సుబ్బారెడ్డి రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షణకులు మధుసూదన్ రెడ్డికి అందజేశారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళారాధన వేదికపై శనివారం హైదరాబాద్‌కు చెందిన అనన్యరెడ్డి బృందం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



మహానందిలో భక్తుల సందడి

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారు కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

ఆన్‌లైన్‌లో పది మార్కుల మెమోలు

నంద్యాల(న్యూటౌన్): 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష మెమొలను (మార్కుల జాబితా) ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఎస్‌సీ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదలైన నేపథ్యంలో షార్ట్ మెమోలు www. bsc.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. విద్యార్థి రోల్ నెంబరుతో లాగిన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. మెమోలో తప్పులు, పొరపాట్లపై విద్యార్థుల తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలన్నారు.

బంగారు హారం సమర్పణ



బంగారు హారాన్ని అందజేస్తున్న దాత

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి హైదరాబాద్‌కు చెందిన నూకల నటరాజ్ 375.400 గ్రాముల బరువు ఉన్న లక్ష్మీ కాసుల బంగారు హారాన్ని సమర్పించారు. శనివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు బంగారు హారాన్ని అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు శ్రీ మార్కండేయ స్వామి, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఎం. హరిదాసు, అమ్మవారి ఆలయం ఇన్‌స్పెక్టర్ రామనాయుడులకు అందజేశారు. ఈ హారం విలువ సుమారు రూ.24.41 లక్షలు అని దాతలు పేర్కొన్నారు. అనంతరం దాతను వేదాశీర్వచనముతో శ్రీస్వామిఅమ్మవార్ల శేష వస్త్రాలను, ప్రసాదాలు అందజేశారు.

మెగా లోక్ అదాలత్‌తో 562 కేసులు పరిష్కారం



లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న జడ్జి రాధారాణి, తదితరులు

నంద్యాల(వ్యవసాయం): జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా 562 కేసులను పరిష్కరించారు. నంద్యాల కోర్టు ఆవరణలో నంద్యాల మూడవ అదనపు జిల్లా జడ్జి, లోక్ అదాలత్ చైర్మన్ వాసు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్ అదాలత్ కార్యక్రమంలో 207 కేసులు పరిష్కారం కావడంతో పాటు పలు కేసుల్లో కక్షిదారులకు రూ.2.47 కోట్ల పరిహారం అందించామన్నారు. చిన్న చిన్న సమస్యలకు న్యాయస్థానాలను ఆశ్రయించకుండా లోక్ అదాలత్‌కు వెళ్తే సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. కుటుంబ కలహాల వలన భార్యాభర్తలు కోర్టును ఆశ్రయిస్తే పిల్లల భవిష్యత్తు దెబ్బ తింటుందన్నారు. రాజీయే రాజమార్గమని కక్షిదారులు తెలుసుకోవాలన్నారు. మోటారు వెహికల్ కేసులు 50, క్రిమినల్ అప్పీల్ 3, ఈపీలు 26, భూ సమస్యలు 7, సివిల్ కేసులు 3, క్రిమినల్ 115, మెయింటనెన్స్ 2, బీఎస్ఎన్ఎల్ కేసులు 1 చొప్పున 207 కేసులు పరిష్కరించామన్నారు. జిల్లాలోని ఆళ్లగడ్డలో 77 కేసులకు రూ.2.2 కోట్లు, కోవెలకుంట్లలో 74 కేసులు పరిష్కారం కాగా రూ.33 లక్షలు, బనగానపల్లెలో 31 కేసులు, డోన్‌లో 130 కేసులు, ఆత్మకూరులో 43 కేసులు పరిష్కరించారు.



కృష్ణానదిలో వలతో చేపలు పడుతున్న మత్స్యకారులు



మత్స్య సంపద.. మిలమిల

- కృష్ణానది చేపలకు డిమాండ్
- ఢిల్లీ, కోల్‌కత్తా, తమిళనాడు, కేరళ ప్రాంతాలకు ఎగుమతి
- జిల్లాలో 5 వేలకు పైగా మత్స్యకారులు

నందికొట్కూరు: బీడు భూములను సస్యశ్యామలం చేస్తున్న కృష్ణమ్మ తన ఒడిలోని మత్స్య సంపదతో వేల కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తోంది. కృష్ణానది తీరం వెంబడి ఉన్న నందికొట్కూరు, పగిడ్యాల, కొత్తపల్లి మండలాలకు చెందిన మత్స్యకారులు మరబోట్లు, తెప్పలపై వెళ్లి చేపలవేట సాగిస్తున్నారు. నంద్యాల జిల్లాలో చేపల వేటపై ఆధారపడి జీవించే మత్స్యకారులు 5 వేల మందికి పైగా ఉన్నారు. నియోజకవర్గంలోని నెహ్రూనగర్, బిజినవేముల, మాడుగుల, మల్యాల, శాతనకోట, కొణిదేల, జడ్డువారిపల్లె, కపిలేశ్వరం, ఎర్రమఠం, బలపాలతిప్పా, సిద్ధేశ్వరం, జానాలగూడేం, నాగటూరు గ్రామాల పరిధిలో చేపల వేటపైనే ఆధారపడి జీవించేవారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వేట సజావుగా సాగితే రోజుకు ఒక్కొక్క మత్స్యకారుడికి రూ.వెయ్యి వరకు గిట్టుబాటు అవుతుంది. కృష్ణానదిలో కట్ల, రోప్పు, మోస్, బంగారు తీగ, జిలేబీ, కొర్రమిట్లు, క్యాట్‌ఫిష్, ఫంగస్ తదితర రకాల చేపలు లభిస్తాయి. ఒక్కొక్క చేప సుమారు 10 కిలోల మేర బరువు ఉంటాయి. ఈ చేపలకు పలు రాష్ట్రాల్లో డిమాండ్ ఉండటంతో వ్యాపారులు ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తారు. స్థానికంగానే కొనుగోలు చేసి భద్రంగా ప్యాక్ చేసి ఢిల్లీ, కోల్‌కత్తా, తమిళనాడు, కేరళ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. కట్ల, రవు, వాలుగ పచ్చి చేపలను కర్నూలు రైల్వే స్టేషన్ నుంచి సికింద్రాబాద్ మీదుగా ఢిల్లీకి తరలిస్తున్నారు. రోజుకు సుమారు 2 వేల కిలోల వరకు ఎగుమతి చేస్తున్నా రు. ఒక బాక్స్‌లో 60 కేజీల చేపలను ఐస్‌తో ప్యాక్ చేసి సరఫరా చేస్తున్నారు. మరో వైపు కోల్‌కత్తాకు లారీలో పచ్చి చేపలను తరలించేందుకు అద్దె రూ. 95 వేల వరకు ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.



ఎండు చేపలను గ్రేడింగ్ చేస్తున్న మత్స్యకారులు



వాహనంలో చేపలను తరలిస్తున్న దృశ్యం

ఏటా చేప పిల్లల విడుదల..

నందికొట్కూరు నియోజకవర్గం వెంట ఉన్న కృష్ణానదిలో ఏటా 30 లక్షలలోపు చేప పిల్లలను విడుదల చేసి మత్స్యసంపద వృద్ధికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. 2021–22లో 30 లక్షలు చేప పిల్లలు, 2022–23లో 28 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. గత ఏడాది సుమారు 40 వేల మెట్రిక్ టన్నుల చేపలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసినట్లు తెలుస్తోంది.

వానొస్తే కష్టం.. నష్టం

నది తీరం వెంబడి జాలర్లు ఎక్కువగా ఎండు చేపల వ్యాపారానికి ప్రాధాన్యత ఇస్తారు. పలు రకాల మత్స్య సంపదను ఆరబెట్టి పలు ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. సరైన షెడ్లు లేకపోవడంతో బాగా ఎండి రెండు రోజుల్లో ప్యాకింగ్‌కు సిద్ధం చేసుకునే సమయంలో వర్షాలు పడి తడిచి పోవడంతో మత్స్యకారులకు భారీగా నష్టం వాటిల్లుతోంది. ఎండిన చేపలు తడిస్తే వెంటనే పురుగు పట్టే ప్రమాదం ఉంటుందని జాలర్లు చెబుతున్నారు.



నది తీరంలో చేపలను ఎండబెట్టిన దృశ్యం

షెడ్లు నిర్మించాలి



వర్షకాలంలో వేట సాగించిన తరువాత మత్స్య సంపదను కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నదీ తీరంలో షెడ్లు, విక్రయ కేంద్రాలు ప్రభుత్వం నిర్మిస్తే బాగుంటుంది. వర్షానికి తడిచిన ఎండు చేపల నాణ్యత దెబ్బతిని వ్యాపారస్తులు కొనుగోలు చేయకపోవడంతో మా కష్టం నీటి పాలవుతోంది. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

– వెంకటేశ్వర్లు శాతనకోట గ్రామం, నందికొట్కూరు మండలం

విక్రయ కేంద్రం ఏర్పాటు చేయాలి



నది తీరంలో విక్రయ కేంద్రం నిర్మిస్తే మత్స్యకారుల కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుంది. ఆగస్టు నుంచి ఫిబ్రవరి వరకు చేపల వేట బాగా సాగుతుంది. సరైన మార్కెటింగ్ సౌకర్యం లేక నష్టపోతున్నాం. మధ్య దళారుల చేతిలో మోసం పోకుండా విక్రయ కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధర లభిస్తుంది. చేపల నిల్వకు, ఐస్ తయారీకి షెడ్లు ఏర్పాటు చేయాలి.

– పుల్లయ్య పెద్ద గుమ్మడాపురం, కొత్తపల్లి మండలం

అస్సాంకు ఎండు చేపలు..

కృష్ణానదిలో లభించే దొందులు, మోస్, చిన్న మోస్, పకీల రకాలను నది తీరంలో ఎండబెడతారు. వాటిని నల్గొండ జిల్లాలోని దేవరకొండ వరకూ స్థానిక వ్యాపారస్తులు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడ రొయ్యలు, దొందులు కిలో ధర రూ. 100 చొప్పున కొనుగోలు చేసి అక్కడ రూ. 150కు విక్రయిస్తారని తెలుస్తోంది. మోస్, చిన్న మోస్, పకిలు కిలో ధర రూ.30లకు కొనుగోలు చేసి అక్కడ మార్కెట్‌లో ధర రూ. 100కు అమ్ముతున్నారు. ఎండకాలంలో వీటికి మంచి ధర ఉంటుంది. అక్కడి నుంచి వ్యాపారస్తులు ఎండు చేపలను అస్సాంకు ఎగుమతి చేస్తున్నారు.

జయహో..



కర్నూలు రాజ్‌విహార్ సెంటర్‌లో జాతీయ జెండాతో క్రీడాభిమానుల సంబరాలు

క్రీడాభిమానుల హృదయాలు ఉప్పొంగాయి.. జయహో భారత్ నినాదం మిన్నంటింది.. త్రివర్ణ పతాకం రెపరెపలాడింది.. నరాలు తెగే ఉత్కంఠ పోరులో భారత్ క్రికెట్ జట్టు జయకేతనం ఎగురవేసింది. టీ–20 వరల్డ్ కప్‌లో దక్షిణాఫ్రికాపై గెలిచి విశ్వవిజేతగా నిలిచింది. పెల్లుబికిన ఉత్సాహంతో యువకులు రోడ్లపైకి వచ్చి సంబరాలు జరుపుకున్నారు. కేకులు కట్ చేసి, బాణాసంచా కాల్చి సందడి చేశారు. కర్నూలు రాజ్‌విహార్ సెంటర్‌లో శనివారం అర్ధరాత్రి పండుగ వాతావరణం నెలకొంది. టీమిండియాకు జేజేలు చెబుతూ యువత ఆనందాన్ని పంచుకుంది.

– ఫొటోలు: జమ్మన్న, కర్నూలు సిటీ



బాణా సంచా కాల్చుతూ..



యువకుల కోలాహలం..

అధికారులు హుందాగా వ్యవహరించాలి

- ప్రభుత్వం మారితే వైఖరి ఎందుకు మార్చుకుంటున్నారు
- మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపల్ శాఖ అధికారులు హుందాగా వ్యవహరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని కమిషనర్ నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా నూతనంగా ఎన్నికైన ప్రభుత్వానికి కౌన్సిల్ సభ్యులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కౌన్సిల్ ముందు ఉంచిన 29 అంశాలను సభ్యులు ఆమోదించారు. అనంతరం సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా చేసిన పనులను ఇప్పుడు ఎలా ఆమోదిస్తారని, మధ్యలో ఉన్న వాటిని కూడా పూర్తి చేసేందుకు జనరల్ ఫండ్ నుంచి చెల్లింపులు చేయాలని కోరారు. ఇందుకు చైర్‌పర్సన్ స్పందిస్తూ.. ప్రభుత్వ ఆదేశాలు, జిల్లా కలెక్టర్ సూచనలు ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధులు మంజూరు ఉంటాయన్నారు. 25వ వార్డు కౌన్సిలర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి ప్రభుత్వం మారిన తర్వాత వార్డుల్లో ఎందుకు కనిపించడం లేదో తెలియడం లేదని, కనీసం ఫోన్లు చేసినా స్పందించడం లేదని.. ఎవరికైనా భయపడుతున్నారా? అని ప్రశ్నించారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ.. తాము ప్రభుత్వ ఉద్యోగులమని ఎన్ని ప్రభుత్వాలు మారినా ప్రజలకు సేవ చేయడం మాత్రమే తమ కర్తవ్యమన్నారు. ఎలాంటి రాజకీయ పార్టీలకు వంత పాడమన్నారు. నిత్యం సమస్యలు ఉన్న ప్రాంతాలను సందర్శిస్తున్నామని చెప్పారు.



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు



మాట్లాడుతున్న చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా

సిబ్బందిపై దాడులు జరుగుతున్నా పట్టించుకోరా

నంద్యాల పట్టణంలో మున్సిపల్ శాఖకు చెందిన కింది స్థాయి సిబ్బందిపై దాడులు చేసినా ఉన్నతాధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని 18వ వార్డు కౌన్సిలర్ దేశం సులోచన ప్రశ్నించారు. కొన్ని రోజుల క్రితం తమ వార్డులో అక్రమంగా ఇంటి నిర్మాణం జరుగుతుండగా నోటీసులు ఇచ్చేందుకు వెళ్లిన వార్డు ప్లానింగ్ సెక్రటరీపై ఓ వ్యక్తి దాడి చేసినా కమిషనర్ స్పందించకపోవడం దారుణమన్నారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ.. ప్లానింగ్ వార్డు సెక్రటరీపై దాడి సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, పట్టణంలో 122 అక్రమ నిర్మాణాలపై కేసులు నమోదు చేశామన్నారు. అక్రమ నిర్మాణాలపై కోర్టు ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు. కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధుల సహకారంతో పట్టణ అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు.

మొదటి రోజే వంద శాతం పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం లబ్ధిదారులందరికీ జూలై 1వ తేదీన వందశాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పెన్షన్ల పంపిణీపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని జూలై 1వ తేదీనే పూర్తిచేయాలన్నారు. ప్రతి 50 ఇళ్లకు కేటాయించిన సిబ్బందికి తగు శిక్షణ ఇచ్చి క్లస్టర్ల వారీగా సంబంధిత మొత్తం, బయోమెట్రిక్ డివైస్ యాప్, పంపిణీ చేసిన మొత్తానికి రసీదులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. 1వ తేదీన ఉదయం 5–30 గంటలకంతా క్షేత్ర స్థాయిలో ఉండి 6 గంటలకు పెన్షన్ మొత్తాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. 2వ తేదీకి పెండింగ్ ఉంటే సంబంధిత అధికారులపై తీవ్ర చర్యలు తప్పవన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు గైర్హాజరైన, ముందస్తు అనుమతి లేకుండా సెలవులో వెళ్లిన కొత్తపల్లి, కొలిమిగుండ్ల ఎంపీడీఓలకు షోకాజు నోటీసు జారీ చేయాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డిని ఆదేశించారు. సమావేశంలో డీపీఓ మంజులవాణి, డీఎల్‌డీఓ కల్యాణి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

ఎన్నికల హామీలు నెరవేరుస్తాం

- మంత్రులు ఫరూక్, బీసీ జనార్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్ధన్‌రెడ్డి

నంద్యాల టౌన్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖమంత్రి ఎన్ఎండీ ఫరూక్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి, భూమా అఖిల ప్రియ, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, గౌరు చరిత రెడ్డి తదితరులతో కలిసి మంత్రులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ శాఖ మంత్రి ఫరూక్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల నంద్యాల పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, అదనపు ఎస్ఎస్ ట్యాంక్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి మట్లాడుతూ ఎన్టీర్ భరోసా పెన్షన్‌ను వెయ్యి రూపాయలు పెంచి జూలై నెల నుంచి అందిస్తామన్నారు. పెరిగిన పెన్షన్‌ను ఏప్రిల్ నెల నుంచి కలిపి ఏక మొత్తంగా ఇంటి వద్దే లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. జిల్లాలో 2,21,240 మంది లబ్ధిదారులకు ప్రతి నెల రూ.93.14 కోట్లు పంపిణీ చేస్తామన్నారు. అటవీ ప్రాంతాల్లో కొండలను కొల్లగొట్టి, ప్రకృతి సంపదను దోచుకున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో పలు రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, ఇందుకోసం ఆయా నియోజకవర్గాల నుంచి నివేదికలు తయారు చేస్తున్నామన్నారు. అలాగే గ్రామాల్లో వీధిలైట్లు, మురుగు కాల్వలు, అంతర్గత రోడ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళ ఆత్మహత్య

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని ఇటిక్యాలకు చెందిన ఓ వివాహిత శనివారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మంగలి రాంపుల్లమ్మ (38)కు మూడు వారాల క్రితం పాము కాటుకు గురైంది. చికిత్స చేయించుకున్నా ఆరోగ్యం సరిగా ఉండేది కాదు. దీనికి తోడు భర్త లక్ష్మీనారాయణ మద్యానికి బానిస కావడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. కొద్ది సేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా మృతి చెందింది. కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్ఐ గోవిందునాయక్ తెలిపారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

కొత్తపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ విష్ణువర్ధన్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. విధి నిర్వహణలోనే మద్యం సేవించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని, ఎన్నికల సమయంలో విధులు సరిగ్గా నిర్వహించలేదని ఎస్పీ రఘువీర్‌రెడ్డికి ఫిర్యాదులు అందాయి. దీంతో జిల్లా ఎస్పీ క్షేత్రస్థాయిలో విచారణ చేయడంతో కానిస్టేబుల్ విష్ణువర్ధన్‌రెడ్డి ప్రవర్తన సరిగ్గా లేదని తేలింది. దీంతో కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారని ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

కొండ చిలువ కలకలం

కొలిమిగుండ్ల: అబ్దులాపురం చర్చి వెనుక భాగాన ఉన్న పంట పొలాల్లో శనివారం కొండ చిలువ ప్రత్యక్షమైంది. గ్రామానికి చెందిన యువకుడు రవి పొలానికి నడిచి వెళుతుండగా రమణారెడ్డికి చెందిన పొలంలో కొండ చిలువ కనిపించడంతో గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. సుమారు ఏడడుగుల పొడవు ఉంటుందని గ్రామస్తులు చెప్పారు. కొద్ది రోజుల నుంచి ఇక్కడే సంచరిస్తున్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కొండ చిలువ సంచారంతో పొలం పనులకు పోయే రైతులు, కూలీలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అటవీ అధికారులు స్పందించి కొండచిలువను పట్టుకొని అడవిలో వదలిపెట్టాలని గ్రామస్తులు కోరారు.

మసకబారుతున్న చిన్నారి చూపు!

- చిన్నపిల్లల్లో కంటి సమస్యలు
- జిల్లాలో 4,351 పాఠశాలల్లో 6,73,728 మందికి కంటి పరీక్షలు
- అందులో 57,328 మంది పిల్లలకు దృష్టి లోపాలు
- 14,528 మందికి కంటి అద్దాల పంపిణీ
- వైద్యుల వద్దకు వస్తున్న వారిలో నాలుగు శాతం మంది చిన్నారులకు దృష్టి లోపాలు
- తదేకంగా సెల్‌ఫోన్, కంప్యూటర్లు చూడటం, పోషకాహార లోపం కారణం



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



కంటి వెలుగు కార్యక్రమంలో ఇచ్చిన కంటి అద్దాలతో విద్యార్థినులు

కర్నూలు(హాస్పిటల్)/నందికొట్కూరు: పాఠశాల, కళాశాలల్లో 20 ఏళ్ల క్రితం తరగతికి ఒకరో ఇద్దరికో కళ్లద్దాలు ఉండేవి. కానీ ఇప్పుడు దాదాపు 60 నుంచి 70 శాతం మంది పిల్లలకు కళ్లద్దాలు వచ్చాయి. ప్రైవేటు విద్యాసంస్థల్లో దాదాపుగా అందరు విద్యార్థులు కళ్లద్దాలతో కనిపిస్తున్నారు. మూడేళ్లకే పాఠశాలకు పంపించడం, పోషకాహారం ఇవ్వకపోవడం, వంశపారంపర్యం తదితర కారణాలతో బాల్యం నుంచే చూపు మసకబారుతోంది. కర్నూలులోని ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రికి ప్రతిరోజూ 300 నుంచి 400 మంది వరకు కంటి చికిత్స కోసం వస్తున్నారు. అందులో నాలుగు శాతం మంది పిల్లలే ఉంటున్నారు. గత ఐదురోజుల్లో 1,609 మంది ఓపీ చికిత్సకు రాగా అందులో 64 మంది పిల్లలున్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గత మూడేళ్లుగా పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో 4,351 పాఠశాలల్లో 6,73,728 మంది పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 57,328 మంది పిల్లలకు దృష్టి లోపాలు ఉన్నట్లు తేలింది. ఇందులో దూరదృష్టి లోపం ఉండటంతో 14,528 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. మిగిలిన వారిలో ఇతర కంటి సమస్యలు ఉన్నాయి. ఈ లెక్కలు కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన వైద్యపరీక్షలు మాత్రమే. ప్రైవేటు పాఠశాలల్లోనూ ఇలాంటి పిల్లల సంఖ్య రెట్టింపుగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు పాఠశాలల్లోనే దృష్టిలోపం ఉన్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటోందని వైద్యులు చెబుతున్నారు.

పిల్లల్లో దృష్టి లోపానికి కారణాలు

పిల్లల్లో విటమిన్-ఏ లోపం వల్ల రేచీకటి, గ్లకోమా, జీరాప్తాల్మియా వంటి కంటి జబ్బులు వస్తున్నాయి. పోషకాహారలోపం కారణంగా పిల్లల్లో ఈ రకమైన విటమిన్ లోపిస్తోంది. మరికొంత మందికి పుట్టుకతోనే కంటి జబ్బులు వస్తున్నాయి. దీనికి జన్యుపరమైన కారణాలు, మేనరికపు వివాహాలు, గర్భంతో తల్లి తీసుకునే కొన్ని రకాలైన మందుల వల్ల ఇది ఏర్పడుతోంది. మేనరికం వల్ల రెటినైసిస్ పిగ్మెంటోజా అనే వ్యాధి పిల్లల్లో వస్తోంది. ఆర్‌వోపీ అనే వ్యాధి ప్రీమెచ్యూర్ పిల్లల్లో వస్తోంది. ఇలాంటి వ్యాధులను సకాలంలో గుర్తించేందుకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు

సామాజిక, ఆర్థిక ఇబ్బందులూ కారణం

సామాజిక, ఆర్థిక ఇబ్బందుల వల్లే పిల్లలు పోషకాహారానికి దూరమై వారు దృష్టిలోపాలకు గురవుతున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. వీరిని ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన వైద్యం అందిస్తే దృష్టి లోపానికి గురిగాకుండా కాపాడుకోవచ్చు. ఈ ఉద్దేశంతోనే గత ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం కింద పాఠశాలల్లో చదివే 6 నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించింది. దృష్టి లోపాలతో బాధపడే పిల్లలను ఉపాధ్యాయులే గుర్తించి, వారికి పరీక్షలు చేయించింది.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

- కళ్లను రోజూ చల్లని మంచినీటితో కడగాలి
- కంటికి సుర్మా, కాటుక వాడకపోవడమే మేలు
- దుమ్ము, పొగ, ప్రకాశవంతమైన కాంతివైపు కళ్లను నేరుగా తెరిచి చూడరాదు.
- పుస్తకాలు చదివే సమయంలో కంటికి అడుగున్నర దూరంలో 45–70 డిగ్రీల వంపులో పెట్టుకుని చదవాలి. తగినంత వెలుతురులోనే చదవాలి.
- రైళ్లు, బస్సుల్లో చదవకూడదు. పడుకుని అస్సలు చదవరాదు.
- చదివే సమయంలో, కంప్యూటర్, సెల్‌ఫోన్, ట్యాబ్ చూస్తున్నప్పుడు ప్రతి 15నిమిషాలకు ఒకసారి కళ్లకు విధిగా విరామం ఇవ్వాలి.
- దృష్టిలోపం ఉంటే కళ్లజోడు వాడటం తప్పనిసరి.

“ దృష్టిలోపాలకు అనేక కారణాలు



పిల్లల్లో వచ్చే దృష్టిలోపాలకు అనేక కారణాలు ఉన్నాయి. ఇందులో అలర్జిక్ కంజెంటివైటిస్ సమస్య ఒకటి. పార్థీనియం మొక్క విదిల్చే దుమ్ము కారణంగా ఈ సమస్య వస్తుంది. ఆహారంలో మార్పులతో వ్యాధినిరోధక శక్తి తగ్గి చూపు తగ్గుతుంది. ఈ సమస్య ఉన్న వారిలో కళ్లు ఎర్రగా మారడం, దురద, కళ్ల నుంచి నీళ్లు కారడం జరుగుతుంది. సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే నల్లగుడ్డుపైకి ఎర్రదనం పాకి చూపు తగ్గే ప్రమాదం ఉంది. దీంతో పాటు రిఫ్రాక్టివ్ ఎర్రర్స్(హ్రస్వదృష్టి) కూడా ఒకటి. ఇది వంశపారంపర్యంగా కొందరికి, అతి చిన్న వయస్సులో పిల్లలను పాఠశాలకు పంపడం, సెల్‌ఫోన్ అతి దగ్గరగా ఎక్కువసేపు చూడటం వల్ల వస్తుంది. దీనిని అధిగమించాలంటే చిన్నతనంలోనే పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించాలి. విటమిన్ల లోపం లేకుండా పోషకాలున్న ఆహారం ఇవ్వాలి.

–డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాల, కర్నూలు

సెల్‌ఫోన్ ఇవ్వడం తగ్గించాలి



ఇటీవల కాలంలో పిల్లలు సెల్‌ఫోన్, కంప్యూటర్, టీవీ స్క్రీన్ చూసే సమయం పెరిగింది. ఈ కారణంగా వారి కళ్లపై ఒత్తిడి పెరిగి దూరదృష్టి సమస్య వచ్చి చిన్నతనంలోనే కంటి అద్దాలు వస్తున్నాయి. దీనికితోడు మారుతున్న జీవనశైలి, ఆరుబయట ఆటలు ఆడకపోవడం, విటమిన్-ఏ లోపం వల్ల కంటి జబ్బులు వస్తున్నాయి. గతంలో కంటే ఇప్పుడు పిల్లల తల్లిదండ్రుల్లో కంటి జబ్బులపై అవగాహన పెరిగింది. పిల్లలు ఏదైనా ఇబ్బంది పడుతుంటే వెంటనే అనుమానం పడి వైద్యులను సంప్రదిస్తున్నారు. ఈ మేరకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స చేయించడం వల్ల ఎక్కువ మంది పిల్లలు కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు కనిపిస్తోంది. కంటి సమస్యలు పోవాలంటే పిల్లలకు సెల్‌ఫోన్ ఇవ్వడాన్ని తగ్గించాలి. కంప్యూటర్, టీవీ చూడటం తగ్గించాలి. ఆరుబయట ఆటలు ఆడేందుకు అవకాశం కల్పించి ఆ మేరకు ప్రోత్సహించాలి.

–డాక్టర్ ఎం. మల్లికార్జున, అసోసియేట్ ప్రొఫెసర్, పీడియాట్రిక్స్, జీజీహెచ్, కర్నూలు

రోడ్డు ప్రమాదంలో గుత్తి వాసి దుర్మరణం



మృతి చెందిన ధనుంజయ

ప్యాపిలి: వెంగళాంపల్లి–వెంకటాంపల్లి మార్గంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం జిల్లా గుత్తి వాసి దుర్మరణం చెందాడు. గుత్తికి చెందిన ధనుంజయ (30), పామిడికి చెందిన శివయ్య బైక్‌పై బేతంచెర్ల మండలంలోని మద్దిలేటి స్వామి దర్శనానికి వెళ్లారు. దర్శనం అనంతరం తిరుగు వెళ్తుండగా వెంగళాంపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ధనుంజయ అక్కడికక్కడే మృతి చెందాడు. శివయ్యకు కాలు విరగడంతో చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు ధనుంజయకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ఐదుగురికి గాయాలు

మంత్రాలయం: మండల పరిధిలోని కల్లుదేవకుంట గ్రామ సమీపంలో శనివారం వేకువ జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఐదుగురికి గాయాలయ్యాయి. బొలేరో కారు, డీసీఎమ్ లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై కర్ణాటకలోని టుంకూరు జిల్లా శిరా గ్రామానికి చెందిన డ్రైవర్ హనుమంతురాజు, రమ్య, శృతి, చరణ్ బొలేరో కారులో వస్తున్నారు. బొలేర కారు, డీసీఎమ్ లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో కారులో ఉన్నవారితో సహా లారీ డ్రైవర్ అవినాష్(లాతురు జిల్లా, హంప గ్రామం, మహారాష్ట్ర), క్లీనర్ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గోపీనాథ్ క్షతగాత్రులను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ హనుమంతు రాజుతో పాటు భక్తులు రమ్య, చరణ్, శృతి చికిత్స నిమిత్తం బెంగళూరుకు వెళ్లారు. గాయపడిన లారీ డ్రైవర్, క్లీనర్‌ను కర్నూలు ఆసుపత్రికి తరలించారు. బెంగళూరులో చికిత్స పొందుతున్న కారు డ్రైవర్ హనుమంతరాజు(28) చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు.

మహానందిలో చిత్తూరు జిల్లా భక్తుడు మృతి

- సుపథ మండపంలో నిద్రిస్తూ అనంతలోకాలకు
- సంప్రోక్షణ జలంతో మండపాల్లో శుద్ధి పూజలు



సంప్రోక్షణ పూజలు చేస్తున్న పండితులు

మహానంది: చిత్తూరు జిల్లా వెలిగల్లుకు చెందిన చేరుపాట్ల ముత్యాలరెడ్డి(55) అనే భక్తుడు శనివారం మహానంది ఆలయ ఆవరణలో మృతి చెందారు. కొద్దిరోజులు క్రితం ఈయన మహానంది ఆలయ పరిసరాల్లోనే ఉంటున్నాడు. ఆలయం ముందు ఉన్న సుపథ మండపంలో సేదతీరుతున్న ఆయన నిద్రలోనే కన్ను మూశాడు. శనివారం ఉదయం విధులకు వచ్చిన ఆలయ ఏఈఓ ఓంకారం వేంకటేశ్వరుడు విషయం తెలుసుకుని ఆధార్‌కార్డు ద్వారా వివరాలు సేకరించి ముత్యాలరెడ్డి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రైవేటు అంబులెన్స్ ద్వారా మృతదేహాన్ని తరలించారు. ఇదిలా ఉండగా ఆలయ సంప్రదాయం ప్రకారం వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆంజనేయశర్మ, హనుమంతుశర్మ, ఆలయ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో సుపథ మండపాన్ని సంప్రోక్షణ జలంతో శుద్ధి పూజలు నిర్వహించారు.

పురపాలక సంఘ కార్యాలయము, డోన్

రేక.నెం. 1545/ఏ1/2024 తేది: 29.06.2024

బాక్స్ టెండర్ నోటీస్

కౌన్సిల్ తీర్మానము నెం. 331 తేది: 28-12-2023నకు లోబడి ఇందుమూలముగా యావన్మంది ప్రజలకు టెండర్ నందు ఆసక్తి గల వారికి తెలియచేయునది ఏమనగా డోన్ పురపాలక సంఘమునకు చెందిన కూరగాయల మార్కెట్, వారపు సంత మార్కెట్, బస్టాండ్, మాంసపు మార్కెట్ మరియు జంతు వధశాల కిస్తులకు సంబంధించిన రుసుమును వసూలు చేసుకొను హక్కును 31.03.2024 తేదీతో ముగిసినందున ప్రస్తుత ఆర్థిక సంవత్సరము 2024-25 మిగిలిన 8 (ఎనిమిది) నెలల కాలమునకు అనగా తేది: 01.08.2024 నుండి అనగా తేది: 31.03.2025 వరకు లీజు హక్కు పొందుటకు డోన్ పురపాలక సంఘ ఆవరణములో తేది: 10.07.2024 బుధవారము ఉదయం గం. 11.00 ల నుండి గం. 12.00 వరకు బాక్స్ టెండర్ నిర్వహించడము జరుగును. టెండరుదారుల సమక్షములో బాక్స్ టెండరు ద్వారా వేలము జరుపబడును. హెచ్చు టెండరు దారునుని టెండరును కౌన్సిల్ నందు ఉంచి ఉత్తర్వులు జారీ చేయబడును. గతములో అనగా ఈ నెల 05.03.2024న, 22.03.2024 మరియు 25.06.2024న బహిరంగ వేలము నిర్వహించగ వేలము పాట నందు పాటదారులు ఎవరు పాల్గొనలేదు. కావున నాల్గవసారి బాక్స్ టెండరు ఆహ్వానించడమైనది.

ఈ క్రింద తెలిపిన మేరకు ఆయాపద్దులకు (బాక్స్ టెండరునకు) కట్టవలసిన ధరావత్తు, సాల్వెన్సి వివరములు

వ నెం.	పద్దు వివరములు	కట్టవలసిన వేలము ధరావత్తు	వ్యక్తిగత సాల్వెన్సీ	పూచికత్తు సాల్వెన్సీ
1	దినసరి కూరగాయల మార్కెట్టు	రూ.8.66 లక్షలు	రూ.8.66 లక్షలు	రూ.8.66 లక్షలు
2.	బస్టాండు	రూ.10.00 లక్షలు	రూ.10.00 లక్షలు	రూ.10.00 లక్షలు
3.	వారపు సంత మార్కెట్టు	రూ.4.00 లక్షలు	రూ.4.00 లక్షలు	రూ.4.00 లక్షలు
4.	జంతు వధశాల	రూ.1.33 లక్షలు	రూ.1.33 లక్షలు	రూ.1.33 లక్షలు

పై బాక్స్ టెండర్ 2024-25 గెజిట్ షరతులకు లోబడి బాక్స్ టెండర్ వేయబడును. కావున ఆసక్తి గల వారందరు సదరు బాక్స్ టెండర్ నందు పాల్గొనుటకు ముందు రోజు అనగా తేది: 09-07-2024 మంగళవారము సా॥ గం. 5.00 లోపు డి.డి. మున్సిపల్ కార్యాలయమునకు సమర్పించిన వారికి మాత్రమే టెండర్ షెడ్యూలు ఇవ్వబడును. మరియు టెండర్ డిపాజిట్ పూర్తిగా చెల్లించవలెను. డిపాజిట్ మొత్తము చెల్లించనివారు టెండర్ నందు పాల్గొనుటకు అనర్హులుగా ప్రకటించబడును. టెండర్ షెడ్యూల్ పోస్ట్ ద్వారా పంపబడవు. టెండర్లు ఏ కారణము లేకయే అంగీకరించుటకు గాని లేదా నిరాకరించుటకు గాని కమిషనర్/ కౌన్సిల్ వారికి పూర్తి అధికారము కలదు. హెచ్చు టెండర్ దారు డిపాజిట్ నుండి వేలము పాట మరియు స్టాంప్ డ్యూటీ, GST మినహాయించుకొని మిగిలిన మొత్తము తిరిగి టెండరుదారుని ఇవ్వబడును. చెక్కులు స్వీకరించబడవు. తదుపరి టెండరునకు సంబంధించిన విషయము ఆఫీసు పని దినములలో పని వేళల యందు తెలుసుకొనగలరు.

సం/- కమీషనరు, డోన్ పురపాలక సంఘం

విద్యార్థి సంఘం నాయకుల హల్‌చల్

- డోన్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గదిలో ధర్నా
- పోలీసులకు ఫిర్యాదు చేసిన పాఠశాల సిబ్బంది
- ఏఐఎస్ఎఫ్ నాయకులపై కేసు నమోదు



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నేతలు



ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వచ్చిన పాఠశాల సిబ్బంది

డోన్: పట్టణ శివారులో గుత్తిరోడ్డులోని మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో శనివారం ఏఐఎస్ఎఫ్ నాయకులు హల్‌చల్ చేశారు. బాలికల పాఠశాలలోకి అనుమతి లేకుండా ప్రవేశించడంతో పాటు ఏకంగా ప్రిన్సిపాల్ గదిలోకి చొచ్చుకెళ్లి ధర్నా చేపట్టడంపై విమర్శలకు దారి తీసింది. రెండు రోజుల క్రితం పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు అదృశ్యం కావడం, అదే రోజు సాయంత్రం కర్నూలులో వారి ఆచూకీ తెలియడంతో పాఠశాలకు చేర్చారు. ఈ విషయం తెలుసుకున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు పాఠశాల వద్దకు చేరుకుని పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంతోనే విద్యార్థులకు రక్షణ లేదంటూ ఆందోళనకు దిగారు. అలాగే ప్రిన్సిపాల్ వసుంధర దేవి గదిలోకి చొచ్చుకెళ్లి ధర్నా చేపట్టారు. దీంతో ఏఐఎస్ఎఫ్ నాయకులు అక్రమంగా చొరబడి తమను భయభ్రాంతులకు గురిచేశారని పాఠశాల సిబ్బంది పోలీసుస్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సూర్యప్రతాప్, నాయకులు మనోజ్, శశిధర్‌రెడ్డి, ధనుష్, ధర్మతేజను అదుపులోకి తీసుకుని న్యూసెన్స్ కేసు నమోదు చేశారు. కాగా వారిని స్టేషన్ బెయిల్‌పై వదిలేశారు. గత ప్రభుత్వం రూ.8కోట్లతో ప్రతిష్టాత్మకంగా బాలికల గురుకుల పాఠశాల నిర్మించి, ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలను చేపట్టింది. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదివే అవకాశం ఉండటంతో ప్రవేశాలకు పోటీ పెరిగింది. రాజకీయ నేతల ఒత్తిళ్లతో అధిక సంఖ్యలో అడ్మిషన్లు ఇవ్వాల్సి రావడం, వారికి వసతి కల్పించలేక పోతున్నామని పాఠశాల సిబ్బంది చెబుతున్నారు. కొన్ని పనులు నిర్మాణంలో ఉండటం, ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులపై పర్యవేక్షణ కష్టంగా మారిందని వాపోతున్నారు. సెక్యూరిటీ గార్డుల నియామకం జరగకపోవడంతో విద్యార్థినులకు రక్షణ కల్పించడం తమకు తలకు మించిన భారంగా మారిందన్నారు. కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థులు ఇంటి మీద బెంగతో తమ కళ్లుగప్పి పాఠశాల నుంచి వెళ్లే ప్రయత్నం చేస్తే విద్యార్థి సంఘాలు తమను బాధ్యులను చేసి దుర్భాషలాడం తగదన్నారు. మరోసారి ఇలాంటివి జరగకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోని భద్రత కల్పించాలని వారు పోలీసులను కోరారు.

1 నుంచి పీజీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పీజీ -4 వ సెమిస్టర్ పరీక్షలు జూలై 1వ తేదీ నుంచి 22 వరకు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ఆచార్య వెంకట సుందరానంద్ పుచ్చ తెలిపారు. వర్సిటీ కళాశాలతో పాటు ఐదు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రెగ్యులర్ 468, సప్లిమెంటరీ 103 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. రాయలసీమ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పరీక్షలు జూలై 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బీటెక్ 2,4,6 సెమిస్టర్ రెగ్యులర్ 505, సప్లిమెంటరీ 590 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు.

మద్దిలేటయ్య ఒక్క రోజు ఆదాయం రూ.2.72 లక్షలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి ఆలయం

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం శివార్లో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామికి జ్యేష్ఠ మాసం శనివారం సందర్భంగా రూ.2,72,830 ఆదాయం వచ్చినట్లు ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణ భక్తులతో కిటకిటలాడింది.